ప్రజాశక్తి
బుధవారం 29 మార్చి 2023
5
విజయనగరం



చీఫ్ కోచ్ అప్పలనాయుడు సస్పెన్షన్

ఇంఛార్జి టెన్నిస్ కోచ్ సత్య గోపాల్

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

జిల్లా చీఫ్ కోచ్, స్విమ్మింగ్ కోచ్ పి.అప్పలనాయుడును సస్పెండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎమ్‌డి ఆదేశాలు జారీ చేశారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో సరైన సమాధానం ఇవ్వకపోవడం, అధికారులను తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇవ్వడం, మూడు రోజుల్లో స్విమ్మింగ్ పూల్‌ను వాటర్‌తో నింపి వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశాలిచ్చినా అమలు చేయనందుకు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఇటీవల ఉద్యోగంలో చేరిన టెన్నిస్ కోచ్ సత్యగోపాల్‌కు ఇంఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

మామిడి రైతుపై వర్షపు పిడుగు

మామిడి రైతుకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే రాలిపోతుంటే రైతన్న నిస్సహాయ స్థితిలో ఉండి పోవాల్సిన పరిస్థితి. పట్టించు కోవాల్సిన ప్రభుత్వాలు కూడా నిర్ధాక్షిణ్యంగా వదిలేయడంతో మామిడి రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నాడు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు మామిడి పంటను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. నిన్నటివరకు ఇబ్బడిముబ్బడిగా కురిసిన మంచు తొలి దశలో మామిడిపూతను పూర్తిగా మాడిపోయేలా చేసింది. మిగిలిన ఆ కొద్ది పూత ద్వారా పింజ కాసి, పంట వస్తుందని ఆశించినా, అకాల వర్షాలు ఆ పంటను కూడా నేల రాలుస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే మామిడి రైతు నిలువునా కుదేలయ్యాడు.

వర్షాలతో దెబ్బతిన్న మామిడితోట



ప్రజాశక్తి-జామి

- నిన్న మంచు...నేడు అకాల వర్షం
- జిల్లాలో భారీగా దెబ్బతిన్న మామిడి
- బీమా సౌకర్యం లేక నష్టపోతున్న రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

జిల్లాలో వరి తర్వాత అతి పెద్ద పంటల్లో మామిడి ఒకటి. జిల్లా మెట్ట భూముల్లో 80శాతం మామిడి పండిస్తున్నారు. గత ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇచ్చిమరీ మామిడి మొక్కలను నాటించిన నేపథ్యంలో నేడు జిల్లాలో సుమారుగా 90వేల నుంచి లక్ష ఎకరాల్లో మామిడి పంట సాగవుతోంది. అత్యధికంగా జామి మండలం అలమండ కేంద్రంగా అధిక సంఖ్యలో మామిడి ఎగుమతి చేస్తున్నారు. మండలంలో 3,500 ఎకరాలకు పైగా మామిడి పంట ఉంది. వేలాది మంది రైతులు మామిడి సాగుపై ఆధారపడి బతుకుతున్నారు. కానీ గత నాలుగేళ్లగా మామిడి రైతు కష్టాలను పట్టించుకునే నాధులే కరువయ్యారు. ప్రతి కూల పరిస్థితులు పంటను దెబ్బతీస్తున్న సందర్భాలే ఎక్కువ. మరో వైపు మామిడి పంటకు మద్దతు ధర లేకపోవడం, పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మామిడి రైతు పూర్తిగా నష్టపోతున్నాడు. ఏటా ఎకరాకు రూ.35వేలు నుంచి రూ.40వేలు వరకు పెట్టుబడులు పెట్టి, అవి తిరిగిరాక అప్పులపాలవుతున్న పరిస్థితులు మామిడి రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఒక్క రైతునే కాదు, పంట కోసం తోటలను లీజుకు తీసుకుంటున్న చిన్నా చితక వ్యాపారులు కూడా తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడుతున్నారు. ఈఏడాది గతం కన్నా నష్టం కలుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటి వరకు వేలకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టామని, ఒక్క పైసా కూడా తిరిగి వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంటల బీమాకు నోచుకోని మామిడి రైతు

వైసిపి అధికారంలో వచ్చిన తరవాత అన్ని పంటలకు పంటల బీమా సౌకర్యం కల్పించి రైతును ఆదుకుంటామని చెప్పింది. కానీ మామిడి మొక్కలకు చేసుకునే బీమా సౌకర్యాన్ని తీసేసింది. చివరికి జిల్లా నోటిఫైడ్ పంటలైన వరి, మొక్కజొన్న, అపరాలు వంటి పంటల జాబితా నుంచి మామిడిని పూర్తిగా తప్పించి, పంటల బీమా పథకానికి కూడా దూరం చేసింది. గతంలో మొక్కకు రూ.50 చెల్లించి బీమా పొందితే, ప్రతికూల పరిస్థితుల్లో మొక్కకు రూ.1,500 వరకు నష్టపరిహారం అందేది. కానీ వైసిపి ప్రభుత్వం మామిడిని జిల్లా నోటిఫైడ్ పంటల జాబితాల్లో చేర్చకపోవడంతో నేడు మామిడి పంట నాశనం అవుతున్నా, రైతు కనీస బీమాకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కొన్ని చోట్ల రైతులు బీమా సౌకర్యం కల్పించాలని విన్నవించుకున్నా, ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలోనే రైతు సంఘాలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

మామిడి రైతును ఆదుకోవాలి



జిల్లాలో మామిడి పంట తీవ్రంగా దెబ్బతింది. ఎకరాకు రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టిన రైతులు మంచు, అకాల వర్షాలు తీవ్రంగా నష్టపరిచాయి. ప్రభుత్వం కూడా బీమా సౌకర్యం కల్పించక పోవడంతో రైతు నిలువునా మునిగిపోతున్న దుస్థితి ఏర్పడింది. కాబట్టి ప్రభుత్వం తక్షణమే మామిడి రైతుకు న్యాయం చేసే విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పంట ప్రారంభమయ్యే ముందు నుంచే ప్రభుత్వం సైంటిస్టులతో పంట పై జాగ్రత్తలు తీసుకునే విధంగా రైతును అవగహన పర్చాలి. లేదంటే భవిష్యతులో మామిడి పంట కనుమరుగయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

- బుద్ధరాజు రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి- నెల్లిమర్ల



ఉత్తరాంధ్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధమవుతోంది. ఈనెల 30న జరిగే శ్రీ రామనవమి ఉత్సవాలు సంధర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బిహెచ్‌విఎన్ కిశోర్ కుమార్ తెలిపారు. స్వామివారి కల్యాణానికి రామతీర్థం వచ్చే భక్తులకు సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ద్వారా తాగునీరు అత్యవసర వైద్య సహాయం వంటి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మండపంలో భక్తులు కళ్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఎల్‌ఇడి టివిలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కళ్యాణానికి ఆలయం అనువంశిక ధర్మకర్త ఛైర్మన్ అశోక్ గజపతిరాజు కుటుంబం ప్రతి సంవత్సరం పట్టు వస్త్రాలు సమర్పిస్తారని గుర్తు చేశారు.

వెయ్యి మందికి అన్నదానం

శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయం వద్ద వెయ్యిత మందికి అన్నదానం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా పానకం, వడపప్పు తయారు చేస్తున్నారు. కాగా ఇప్పటికే తిరుపతి దేవస్థానం నుంచి వస్త్రాలు వచ్చాయి. ప్రభుత్వం తరపున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు శ్రీరామునికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

300 మంది పోలీసు బందోబస్తు

శ్రీరామనవమికి 300 మంది పోలీస్ సిబ్బంది బందో బస్తు నిర్వహిస్తారు. 108, ఫైర్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్, ఎలక్ట్రికల్, నగర పంచాయతీ శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించనున్నారు. నేరుగా భక్తులందరూ వీక్షించే విధంగా భక్తి టీవీ, సంతోషం టీవీ ద్వారా లైవ్ ప్రజెంట్ చేస్తున్నారు.

తలంబ్రాలకు తూర్పుగోదావరి జిల్లా ధాన్యం

శ్రీరామనమిలో శ్రీరాముని కళ్యాణానికి తలంద్రబాలుగా తూర్పు గోదావరి జిల్లా, కిర్లంపూడి మండలం, జగపతినగరం గ్రామానికి చెందిన ధాన్యాన్ని వినియోగించనున్నారు. ఆ గ్రామంలో చదరం శ్రీనివాసరావు 25 మంది భక్తులుచే ప్రకృతి సిద్ధంగా తన సొంత పొలాలలో పండించిన ధాన్యాన్ని ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున సేకరించి, పాలాభిషేకం జరిపి, గోపూజ జరిపి గోటితో శ్రీరామ నామం జపిస్తూ వలచిన తలంబ్రాలను మంగళవారం ఆలయానికి అందించారు.

భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కల్యాణ 'మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం విజయనగరం నుండి భద్రాచలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 29న సాయంత్రం 5గంటలకు విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బస్సులు బయలుదేరి గురువారం ఉదయం 5గంటలకు భద్రాచలం చేరుతుందని తెలిపారు. అదేరోజు(30న) సాయంత్రం 6గంటలకు భద్రాచలం వద్ద బయలుదేరి శుక్రవారం ఉదయం 5.30గంటలకు విజయనగరం చేరుతుందని తెలిపారు. ఒక వైపు టిక్కెట్ పెద్దలకు రూ.840, పిల్లలకు రు. 455గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావలసినవారు ఆర్టీసీ కాంప్లెక్స్ రిజర్వేషన్ కౌంటర్లో గాని ఆన్‌లైన్‌లో గాని రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు 7382920648, 7382924083 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

'ప్రజాశక్తి' కథనంపై స్పందిస్తూ ఆర్‌డిడబ్ల్యుఎస్ ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బాల్య వివాహాలు అత్యంత అనర్థదాయకమని ఆర్‌డిడబ్ల్యుఎస్ (రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ) సురేష్ మహంతి తెలిపారు. చిన్న వయసులో పెళిళ్ల చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని, వారికి పుట్టబోయే బిడ్డలు కూడా ఇబ్బంది పడతారని అన్నారు. 'పెరుగుతున్న బాల్య వివాహాలు' అన్న శీర్షికతో ప్రజాశక్తిలో సోమవారం ప్రత్యేక కథనం వెలువడిన విషయం విధితమే. దీనికి స్పందించిన ఆర్‌డిడబ్ల్యుఎస్ బాడంగి మండలం రాయవలసలో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి బాల్యవివాహాలను వ్యతిరేకించాలంటూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు సురేష్ మహంతి ప్రజాశక్తితో మాట్లాడుతూ తల్లిదండ్రుల పేదరికం, చదువు లేకపోవడం తదితర కారణాలతో ముఖ్యంగా బాలికలకు 18ఏళ్లు నిండక ముందే వివాహాలు చేస్తున్నారని, అందువల్ల శిశువులు కూడా అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాశక్తి ఇచ్చిన స్ఫూర్తితో ఉపాధి పనుల ప్రదేశాల్లో తమ సంస్థ తరపున ప్రచారం మొదలు పెట్టామని, ప్రభుత్వం సహకరిస్తే ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు.



ఉపాధికూలీలకు అవగాహన కల్పిస్తున్న మహంతి

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డిఎస్పీ ఎల్.మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ లు, డిఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరంలోని పలు కూడళ్లలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో స్పీకర్లు ఏర్పాటు చేసి, శబ్ద కాలుష్యం చేస్తూ, మిగతా వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని తొలగించారు. ప్రతీ వాహనదారుడు నిబంధనలు పట్టించుకోపోతే కఠిన చర్యలు తప్పవని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. పెద్ద స్పీకర్లు ఏర్పాటు చేసి, ఇతర వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని డిఎస్‌పి ఎల్.మోహనరావు తెలిపారు.

వ్యవసాయం వైపు యువత అడుగులు వేయాలి

డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువత వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, సాంకేతిక సహకారంతో వ్యవసాయాన్ని అభివృద్ధి చెందించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. అందరి సహకరంతో డిసిఎమ్ఎస్ లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. గత ఏడాది రూ.19 కోట్ల టర్నోవర్ సాధిస్తే ఈ ఏడాది రూ.21 కోట్ల టర్నోవర్ సాధించామని చెప్పారు. డిసిఎంఎస్ కార్యాలయంలో మంగళవారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యుల సహకరంతో ఎన్నో అభివృద్ధి,సేవ, ఉపాధి ఇలా అన్ని రకాల కార్యక్రమాలు డిసిఎంఎస్ ద్వారా చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు టెక్స్ టైల్స్ రంగంలో శిక్షణ, ఖరీఫ్ సీజన్ లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించడం,ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు డిసిఎమ్ఎస్ శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ వి.చినరామునాయుడు, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణా దేవి, డిసిఒ అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి విమల, డిసిఎంఎస్ డైరెక్టర్లు, పిఎసిఎస్ సభ్యులు పాల్గొన్నారు. సభలో ఆర్గానిక్ ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే విధానం, దాని వలన కలిగే లాభాలు గురించి వివరించారు.



మహాజనసభలో మాట్లాడుతున్న డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన



పరీక్షకు అనుమతించాలని డాక్టర్ ఓపి చీటీని చూపిస్తున్న విద్యార్థిని

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థినికి గాయాలు

పరీక్షా కేంద్రానికి పది నిముషాలు ఆలస్యం

పరీక్షకు నిరాకరించిన అధికారులు

కన్నీరుపెట్టిన విద్యార్థిని

ప్రజాశక్తి-రేగిడి, రాజాం

రేగిడి మండలం సోమరాజుపేటకు చెందిన విద్యార్థిని హర్షిత ఇంటర్ మొదటి సంవత్సరం చివర పరీక్ష రాసేందుకు మంగళవారం ఆటోలో రాజాం గాయత్రి కాలేజికి వెళ్తుండగా మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హర్షితకు గాయాలవ్వడంతో వైద్యం కోసం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం ముందుగా కాలేజీ అధికారులకు తెలియజేశారు. వైద్యం అనంతరం పరీక్షా కేంద్రానికి పది నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు, అధికారులకు గాయాలతో పాటు డాక్టర్ ఇచ్చిన ఓపి, మందులు రసీదు చూపించినప్పటికీ పరీక్ష రాసేందుకు వారు అనుమతించలేదు. విద్యార్థి ఎంతసేపు బతిమలాడినా, చివరకు పరీక్షకు అనుమతించక పోవడంతో బోరున ఏడ్చింది. తన భవిష్యత్తు ఏమైపోతుందోనని భయపడి పరీక్ష కేంద్రం గేటు వద్దనే కుప్పకూలింది. ప్రమాదం జరిగినట్లు ముందుగా సమాచారం ఇచ్చినా, అనుమతించక పోవడం అన్యాయమని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

కార్మిక, కర్షక ప్రదర్శనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నెల్లిమర్ల, గరివిడి

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, ప్రజా వ్యతిరేక విధానాలకు, కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో వచ్చేనెల 5న జరగనున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. మంగళ వారం గరివిడి, నెల్లిమర్లలో కార్మికులు, స్కీం వర్కర్లతో సిఐటియు ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్‌శక్తులకు కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారన్నారు. కార్మికులు, కర్షకుల, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా పెట్టుబడిదార్ల ప్రయోజనాలు లక్ష్యంగా పని చేయడం దుర్మార్గ మన్నారు. ఇటీవల బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్రబడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకంగా ఉందని అన్నారు. అందరికీ కనీస వేతనం రూ.26వేలు, కనీస పింఛన్ రూ.10వేలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగనున్న కార్మిక, కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ, అంబళ్ల గౌరునాయుడు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ బి.సుధారాణి, సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, అరసాడ నారాయణరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పల్లి మంగ లక్ష్మీ, అంగన్ వాడీలు, ఆశాలు, ఎండిఎం కార్మికులు, నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రవాణా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

విజయనగరం టౌన్ : మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలని, 4 లేబర్ కోడ్‌ల స్థానంలో పాత 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఏప్రిల్ 5 న ప్రజా సంఘాలు చేపట్టిన మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్ మోహన్ అధ్యక్షతన కోట వద్ద జరిగిన ఆటోకార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తున్నా రన్నారు. రైతుల ఆత్మ హత్యలు దేశ వ్యాప్తంగా పెరిగాయన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు కట్టబెట్టి దోపిడీ చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపిస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఆటో యూనియన్ నాయకులు శ్రీను, నాయుడు, నర్సింగరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



గరివిడి : సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బ రావమ్మ

పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం...

పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ కోసం ఏప్రిల్ 5 న జరిగే మార్చ్ టు పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఒకటి, రెండు, ఐదు సెక్టార్ మీటింగులు సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్వాడీలకు బిల్లులు, మెస్‌ఛార్జీలు, సకాలంలో చెల్లించడం లేదని, ఒక్క గ్యాస్ కోసం ఒక్కొక్క కార్యకర్త నెలకు రూ.500 అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో కేటాయింపులు పెంచి, ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కార్యదర్శి శివలక్ష్మి, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.



విజయనగరం : సదస్సులో మాట్లాడుతున్నరెడ్డి శంకర్రావు

1న 'మధురమే సుధాగానం'

మాధవపెద్ది సురేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -విజయనగరం కోట

వచ్చేనెల 1న మధురమే సుధా గానం సినీ జానపద లలిత సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు నారాయణ కళాక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు బిఎ నారాయణ, అధ్యక్షులు డాక్టర్ జి సన్యాసమ్మ, గౌరవ కార్యదర్శి, జిల్లా బిసి సెల్ ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురు నారాయణ కళా పీఠం ప్రథమ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార్షికోత్సవ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గురు నారాయణ కళాపీఠం స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ దంపతులకు సన్మానం చేసి బిరుదును ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. యువతను ప్రోత్సహిద్దాం అనే ఉద్దేశంతో యువగాయకులను సన్మానం చేయనున్నారు. అందుకు ప్రముఖ నేపథ్యగాయనిస్వరభి శ్రావణికి ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు తెలిపారు. సంగీత విభావరి కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటల నుంచి స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహించినట్లు తెలిపారు.

30న రామనారాయణంలో సీతారామకల్యాణం

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈనెల 30వ తేదీన శ్రీరామనవమి ఘనంగా నిర్వహిస్తున్నామని ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం 6:30గంటలకు సీతారాములకు పంచామత అభిషేకాలు ఉదయం 11గంటలకు రామతారక మంత్ర హెూమం , సాయంత్రం 5గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం 7.30గంటలకు ఊంజల్ సేవ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఎన్‌సిఎస్ మల్టీపెక్స్ ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, ఎన్ సి ఎస్ సినిమా థియేటర్ నుండి ఉచిత బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాసస్వామి, నారాయణం సీతారామయ్య, రామనారాయణం అర్చకులు పివిజె చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి నాచు ఉదయ్ కుమార్ అండ్ బ్రదర్స్ (చాముండి ఎంటర్ ప్రైజెస్) వారి సౌజన్యంతో రూ.6వేలు విలువ గల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందించారు. మంగళవారం ఈ పుస్తకాలను గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్‌కు అందించినట్లు ఆయన వెల్లడించారు. వారికి పాఠకుల తరుపున ధన్యవాదాలు తెలియజేశామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బొబ్బిలి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. టిఆర్ కాలనీలో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఆయనతో మున్సిపల్ ఇంచార్జ్ డిఇ రవికుమార్, ఎఇ సురేష్, కౌన్సిలర్ అనసూయమ్మ ఉన్నారు.

ఎండియు ఆపరేటర్ వితరణ

రేగిడి : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కెంబూరు సత్యం నాయుడు కుమారుడు ఎండియు ఆపరేటర్ శ్రీనివాసరావు వితరణతో విద్యార్థులకు స్టీల్ గ్లాసులు ఎంఇఒ ఎం వరప్రసాదరావు, సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు చేతులు మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఎండియు ఆపరేటర్‌గా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ వితరణ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ఎం రమణ, ఎస్ఎంసి చైర్మన్, విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక ప్రజా వేదిక సమీక్ష

గుర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ పథకం సంబంధించి మండల స్థాయిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపిడి సారథా దేవి హాజరై మండలంలోని 42 పంచాయతీలలో జరిగిన పనులకు సంబంధించిన తనిఖీలను పరిశీలించారు. గ్రామస్థాయిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు వాటి వివరాలను సమావేశంలో తెలిపారు. గ్రామాలలో ఆవెన్యూ ప్లాంటేషన్ ఎక్కువగా మొక్కలు చనిపోయినట్లు నివేదించారు. కొంతమంది క్షేత్ర సహాయకులు 100రోజులు పని దినాలు పూర్తి అయిన వారికి పని కల్పించారని తెలిపారు. గ్రామాలలో సామాజిక తనిఖీ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం వల్ల గ్రామ సభలు నిర్వహించకుండానే పని పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసి నాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతి రావు, చిన్నారావు, క్లస్టర్ ఎపిడి లక్ష్మణరావు, డివిఒ రవీంద్ర, ఎంపిడిఒ కల్యాణి, ఎపిఒ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం

గుర్ల : మండల కేంద్రంలో కేసలి భవనంలో మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయాన్ని జెడ్పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తమతమ విధులను సక్రమంగా నిర్వహించి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తిరుపతి రావు, ఎంపిడిఒ కల్యాణి, పిఒ ఆరుద్ర, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ : మండలంలోని బికెఎస్‌పేట ఎంపిపి పాఠశాలను మంగళవారం ఎంఇఒ జి శ్రీదేవి పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాల వివరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు డైరీని తనిఖీ చేశారు. పిల్లలకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాలను పరిశీలించి వంటకాలను రుచి చూశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వేపాడ : పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని బిఆర్ అంబేద్కర్ గురుకులం జిల్లా సమన్వయాధికారి చంద్రావతి అన్నారు. మంగళవారం ఆమె ఆ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలన్న విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులు శతశాతం సాధించేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను తనికీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బొద్దాంలో బ్రహ్మకుమారీల శాంతి ర్యాలీ

వేపాడ : మండలంలోని బొద్దాంలో మంగళవారం శివాలయం వద్ద నుండి పూర్ణ కవచాలు, శివలింగాలు, జెండాలు పట్టుకొని గ్రామంలో బ్రహ్మ కుమారీలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, గౌరీపురం, కొత్త బొద్దాం, ఎస్‌కోట గ్రామాల భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఫారం ఆవిష్కరణ

విజయనగరం కోట: స్థానిక పిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో మెంబర్స్ స్టేటస్ డిక్లరేషన్ ఫారాన్ని రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కంబాల బాబురావు ఆవిష్కరించారు. అనుభవ వైద్యుల సంఘాల సమైక్య రూపొందించిన ఎంఎస్‌డిఎఫ్ ఫారంలో ఆర్ఎంపిలంతా నమోదు కావాలని కోరారు. రాష్ట్రంలో ఎంత మంది సభ్యులు ఉన్నారో ఈ కార్యక్రమం ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జోనల్ అధ్యక్షులు జంగం జోషి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గద్దె చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉపాధ్యక్షులు రామ్మూర్తి రాజు, ముత్యాల రావు, కోశాధికారి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సీతం'లో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విజయదుర్గా యూత్ సొసైటీ, సీతం ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు ఆధ్వర్యంలో కేశవపట్నం దుర్గారావు 67వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఈ శిబిరాన్ని సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ప్రారంభించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ రక్తదానం చేసి మరొకరి ప్రాణం కాపాడొచ్చునని తెలిపారు. శిబిరానికి 40 మంది యువకులు స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. విజయ దుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు కేశవపట్నం చంద్రిక ను అభినందించారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్.ఇల్తామాష్, రాయల్ క్యాబ్స్ శరత్, సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

విజయనగరం : జనసేన నాయకులు గురాన అయ్యలు సమక్షంలో నగరంలోని పలు డివిజన్లకు చెందిన యువకులు మంగళవారం ఆ పార్టీలో చేరారు. వారికి జనసేన కండువాలు వేసి పార్టీలోకి అయ్యలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, దోపిడీ విధానాలపై పోరాటం చేయడానికే పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించారన్నారు. జనసేనకు యువత అండగా నిలబడడం అభినందనీయమన్నారు.

సేవలు ఆదర్శంగా ఉండాలి

విజయనగరం టౌన్: రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరిన్ని సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అయ్యన్నపేటలో రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఎంపిపి స్కూల్ భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వ్యాపారవేత్తలంతా కలిసి రౌండ్ టేబుల్ సంస్థ ద్వారా పలు ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రౌండ్‌టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో రూ.30లక్షలతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించడమే కాకుండా విద్యార్థులకు కార్పోరేట్ పాఠశాలల స్థాయిలో బెంచీలు ఇచ్చారన్నారు. వీటి తో పాటు సంస్థ గోకుల్ పార్కు అభివృద్ధి, బుంగవీధి స్కూల్ అభివృద్ధి, వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు శ్రావణి, రేవతీదేవి, కమిషనర్ శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు వేగవంతం

బొబ్బిలి : మున్సిపాలిటీలో పైపులైన్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస రావు కోరారు. పైపులైన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు పూర్తి చేస్తే తాగునీటి సరఫరా పునరుద్దరణ చేస్తామన్నారు. అనంతరం పన్నులు వసూళ్లలో సిబ్బందితో పాల్గొన్నారు. ఈనెలాఖరులోగా పన్నులు వసూలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- గజపతినగరం

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, ప్రజలకు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. పాలన సాగిస్తున్నంత కాలం ప్రజాస్వామిక, కార్మిక హక్కులు కాలరాస్తుండడం, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా అప్పజెబుతున్నారన్నారు. ప్రభుత్వ భూములను ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తి ప్రైవేటుపరం చేసి దేశాన్ని నష్టాలు పాలు చేస్తున్నారని మండిపడ్డారు. ధరలను విపరీతంగా పెంచి ప్రజలు నడ్డి విరిచారన్నారు. అనేక ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించక రెగ్యులర్ చేయక చాలా నరకం చూపిస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ధరలు పెంచి ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోన్నారన్నారు. ఎదిరిస్తే ఉక్కు పాదాన్ని మోపుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలరాజు, కె. కృష్ణ, గోవిందా, లక్ష్మణ, పైడ్రాజు, శ్రీను పాల్గొన్నారు.

బొబ్బిలి : కార్మికులు, రైతులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, స్కీమ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏప్రిల్ 5న జరగనున్న ఛలో ఢిల్లీను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, స్కీమ్ వర్కర్స్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న వేతనాలు పెరగడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోటారు కార్మికులపై పోలీసు, రవాణా శాఖాధికారుల వేధింపులు ఆపాలని కోరారు. స్కీమ్ వర్కర్స్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఛలో ఢిల్లీకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి గౌరీ, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: చలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సురేష్, శ్రీనివాస్

శృంగవరపుకోట: ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ కోరారు. పట్టణంలోని మహాత్మాగాంధీ పార్క్ లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మతోన్మాద రాజకీయ బిజెపి పార్టీ అధికారంలో ఉంటే భవిష్యత్‌లో మరో బ్రిటిష్ పాలన సవి చూడక తప్పదన్నారు. అందుకని ఏప్రిల్ 5న చలో ఢిల్లీ బయలుదేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిఐటియు మండల నాయకులు చెలికాని ముత్యాలు, ఆశావర్కర్ల సంఘం నాయకులు సామమ్మమ, విమల, రమణమ్మ, అనురాధ గిరిజన రైతులు బుచ్చన్న, రామన్న, తదితరులు పాల్గొన్నారు..

బొద్దాం ప్రభుత్వ పాఠశాలను గాలి కొదిలేస్తారా?


ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గాలికి వదిలేస్తారా? అని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష ప్రశ్నించారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కనీస సదుపాయాలు లేవని మండిపడ్డారు. మంగళవారం ఆ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కేజీ టు పీజీ వరకూ ఉచిత, నాణ్యమైన విద్యను అన్ని సౌకర్యాలతో కలిపి అందిస్తామని చెప్పి ఇప్పుడు పాఠశాలలను పట్టించుకోవడం లేదన్నారు. బొద్దాం పాఠశాలను ఎంఇఒ, డిఇఒలు పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలకు గత 5,6 సంవత్సరాలుగా సొంత బిల్డింగ్ లేదని, వర్షం పడితే క్లాసుల్లోకి వర్షపు నీరు చేరి తరగతులకు ఆటంకం జరుగుతుందని అన్నారు. మరో పక్క తాగడానికి మంచి నీరు లేదని, విద్యార్థులకు సరైన బెంచీలు, పాఠం చెప్పే టీచర్లుకు కూడా సరైన కుర్చీలు లేవని అన్నారు. మరో పక్క విద్యార్థులకు తరగది లోపల కరెంట్ సదుపాయం లేక విద్యార్థులు ఉక్కపోతతో క్లాసుల్లో కూర్చుని అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. నాడు - నేడు రెండు విడతలలో ఈ పాఠశాల ఎందుకు ఎంపిక కాలేదో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి నాడు - నేడులో ఎంపిక చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా సొంత బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. లేదంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

గవరపాలెంలో గడప గడపకు..

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గవరపాలెం, మిందివలస గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు గురించి వివరించారు. అనంతరం ఇంటింటికి ముఖ్యమంత్రి పంపిన లేఖను అందజేస్తూ, మూడేళ్ళలో మీ అందరి చల్లని చూపులతో మంచి చేసామని, ఇక ముందు కుడా మంచి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ చైర్మన్ గోరపల్లి శివ, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతుల వెంకటరావు, పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఆదిరెడ్డి అప్పన్న, పెనుగంటి చెల్లయ్య, ఐతంశెట్టి అనిల్ కుమార్, పిఎస్ఎన్ పాత్రుడు, లెంక రామన్న పాత్రుడు, వార్డు సభ్యులు మిందివలస రామకృష్ణ, దాడి శ్రీను, గంగారపు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లాలో ఫెర్రో పరిశ్రమలపై విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని, అందువల్ల కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. ఫెర్రో పరిశ్రమలపై మోపిన బారాలను ప్రభుత్వాలు తగ్గించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్రంలో ఫెర్రో పరిశ్రమల మీద విద్యుత్ చార్జీలు ప్రభుత్వం రూ.350 కోట్లు పెంచి అటు యాజమాన్యానికి, ఇటు కార్మికులకు పెనుభారం మోపిందన్నారు. ప్రభుత్వం పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని, కష్టాల్లో ఉన్న ఫెర్రో పరిశ్రమలను, పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ఫెర్రో పరిశ్రమలపై విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలపై అదనపు భారం పడి మూత దిశగా పయనిస్తున్నాయని ఆందో ళన వ్యక్తం చేశారు. అనంతరం కొత్తవలస ఇంచార్జ్ తహశీల్దార్ హేమంత్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, పి చిన్నయ్య, రాము, ఈశ్వరరావు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న తమ్మినేని


బొబ్బిలి : ఫెర్రో పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎస్.గోపాలం పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా గ్రోత్ సెంటర్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంపుతో ఫెర్రో పరిశ్రమలు మూత పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలతో పరిశ్రమలు మూత పడుతున్నామన్నారు. పరిశ్రమలు మూతతో కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

మూడోవిడత ఆసరా నిధులు రూ. 6,419 కోట్లు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అక్కా - చెల్లెమ్మల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రాష్ట్రంలో మూడో విడత ఆసరా నిధులు రూ. 6,419 కోట్లు మహిళల ఖాతాల్లోకి నేరుగా జమ అయిందని జిల్లా పరిషత్తు చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతపేట సమీప శాంభవి లేఔట్‌లో మంగళవారం ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైయస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ గడిచిన 45 నెలల పాలనలో వివిధ పథకాల ద్వారా అక్కా చెల్లెమ్మలకు రూ 2.25 లక్షల కోట్లు తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలనేది సీఎం జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశం అన్నారు. వైసిపి సుపరిపాలన దృష్టిలో పెట్టుకుని రాబోయే 2024 ఎన్నికల్లో మీ యొక్క అభిమానాన్ని చూపాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్కవరపుకోట మండలంలో ఉన్న 1056 స్వయం సహాయ సంఘాలకు చెందిన 11,540 మంది డ్వాక్రా మహిళలకు రూ 7.50 కోట్లు మహిళల ఖాతాల్లో జమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మహిళలకు చెక్కును అందిస్తున్న జిల్లా పరిషత్తు చైర్మన్, ఎమ్మెల్యే

అనంతరం వైయస్సార్ కంటి వెలుగులో భాగంగా జాతీయ అందత్వ దృష్టిలోప నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నపాటి దృష్టిలోప విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ, ఎంపిడిఒ కె. రూపేష్, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, ఎపిఎం అప్పలనాయుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు సింగపూర్ సత్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, కురాకుల సూర్యారావు వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు పదో తరగతి కీలకం

లక్కవరపుకోట: ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదవడానికి పదో తరగతి పరీక్షలు కీలకమని నియోజకవర్గం టిడిపి నాయకులు గొంప కృష్ణ అన్నారు. పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌కోట, గొల్జాం, కొట్యాడ, చందు లూరు, కల్లెపల్లి గొంగుపూడి జెడ్‌పి పాఠశాల విద్యార్థులతో పాటు ఎపి మోడల్ స్కూల్లో, కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కూడా మెటీరియల్ అందించారు. మొత్తంలో మండలంలో 481 మంది విద్యార్థులకు పరీక్ష రాసుకునేందుకు ప్యాడలు, పెన్నులు, ఇతర సామాగ్రిని అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జామి టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంటు ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్ , టిడిపి నాయకులు మంగరాజు , పెదిరెడ్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ తీసుకున్న విద్యార్థులతో గొంప కృష్ణ

కొత్తవలస: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని టిడిపి నియోజకవర్గం నాయకులు గొంప కృష్ణ అన్నారు. మండలంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను మంగళవారం అందించారు. కొత్తవలస, కంటకాపల్లి, దెందేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతో పాటు ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, టిడిపి నాయకులు పొలమరశెట్టి బాలకృష్ణ, జగ్గా రావు, లెంక శ్రీను, తిరుపతి రావు, సూరిబాబు, సతీష్, ప్రకాష్, దాడి శ్రీను, గంగరాజు, రమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి- బొబ్బిలి

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి, సీనియర్ న్యాయవాది సి హెచ్ సూర్యనారాయణ అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞావికాస పరీక్ష విజేతలకు మంగళవారం శ్వేతాచలపతి స్కూల్లో బహుమతులు అందజేశారు. 600 మంది పరీక్షలు రాశారని వీరిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో పి.గీతాంజలి, ద్వితీయ స్థానంలో బి.పూజ, తృతీయ స్థానంలో ఎస్.జాహ్నవి నిలిచారు. వీరికి బహుమతులు అందజేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని విద్యార్థులను విజయగౌరి, సూర్యనారాయణ కోరారు. లక్ష్యాలను అధిగమించేందుకు విద్యార్థులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణదాసు, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు, కేశవ, పుణ్యవతి, మణికుమార్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న విజయగౌరి

శృంగవరపుకోట : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో స్థానిక నారాయణాస్ కేంబ్రిడ్జ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సి హెచ్ శేషు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ నిర్వహించిన టాలెంట్ పరీక్షలో మండల స్థాయిలో మొదటి ర్యాంకును కె.తనూజ, మూడవ ర్యాంకును ఎ.ప్రమోద్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ర్యాంకులు సాదించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజియం శివరాం, శ్రీనివాసరావు, రీజనల్ ఇంచార్జ్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ పరీక్షల్లో నారాయణ విద్యార్థులు



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

సొంత నిధులతో పారిశుధ్య పనులు

నెల్లిమర్ల : నగర పంచాయతిలో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మంగళ వారం తన సొంత నిధులతో పారిశుధ్యం పనులు చేపించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ 7వార్డు పరిధిలో డ్రైనేజ్ కాలువలో వ్యర్థాలు, మురుగు పూడికపోవడంతో మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని తన దృష్టికి రావడంతో వెంటనే పనులు చేయించామన్నారు. జెసిబిని ఏర్పాటు చేసి మురుగును తొలగించడం జరిగిందన్నారు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని కౌన్సిలర్ ప్రసాద్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

అది ప్రమాదం కాదు..హత్యకు కుట్ర

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస జాతీయ రహదారి సాయికృష్ణ కోల్డ్ స్టోరేజ్ సమీపాన ఇటీవల బొలెరో వాహనం పల్సర్ బైక్‌ను ఢీకొనడంతో ఆరికతోట గ్రామానికి చెందిన కర్రి శంకర్రావు గాయాల పాలయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. అయితే ఈ సంఘటన దర్యాప్తులో పలు ఆసక్తి కరమైన విషయాలతో పాటు పాత కక్షల నేపథ్యంలో కుట్ర కోణం బయటపడింది. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. గతేడాది జూలై 1న ఆరికతోటలో నడివీధిలో జనసంచారం మధ్య వర్రి చిన్నోడు అనే వ్యక్తిని అతి దారుణంగా తల మొండెం వేరైనట్లు నరికి చంపారు. ఈ ఘటనలో అప్పట్లో 4 గురు ముద్దాయిలను గుర్తించి జైలకు తరలించారు. వీరికి కోర్టు బైలు మంజూరు చేయడంతో వీరు సామాన్య జీవనం గడుపుతున్నారు. ఈ హత్యా కాండలో నాలుగో ముద్దాయిగా ఉన్న కర్రి శంకరరావును టార్గెట్ చేసి హత్యకు గురైన చిన్నోడు కుమారులు, బంధువులు వర్రి శివుడు, వర్రి గౌరీశ్వరరావు, మామిడి రామన్న, పట్టిం గోపాల్ కలిసి కర్రి శంకరరావును మట్టు పెట్టే ఉద్దేశంతో బొలెరో వాహనం కొని డీ కొట్టి చంపాలని ప్లాన్ వేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 14న బైక్ పై వస్తున్న శంకర రావును డీ కొట్టి చనిపోతే ప్రమాదంలోనే చనిపోయినట్లుగా నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే శంకర రావు తృటిలో తప్పించు కొని స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తమదైన శైలిలో ఎస్ఐ సురేంద్ర నాయుడు, సిబ్బంది ఈ సంఘటన పై దర్యాప్తు ముమ్మరం చేసి కుట్ర కోణాన్ని వెలికి తీశారు. గుర్తించిన ముద్దాయిల పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సిఐ తిరుమలరావు ఘటనా స్థలాన్ని, ఆరికతోట గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఇద్దరు అరెస్ట్

బొబ్బిలి : బాడంగి మండలం పరిధిలో గజరాయనివలస గ్రామానికి చెందిన జామి దాసు, సత్యవరపు రవికుమార్ అక్ర మంగా మద్యం సీసాలు విక్రయి స్తుండగా 28 మద్యం సీసాలతో వారిని పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఇబి సిఐ జైభీమ్ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది మాధవి, చంద్ర ప్రసాద్, జయరామ్‌లు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

విజయనగరం : నగరంలోని గంట స్తంభం వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ హరిబాబు నాయుడుపై దౌర్జన్యం చేస్తూ, విధులకు ఆటంకం కలిగించిన లంకా పట్నంకు చెందిన సోమ శంకరరావును అరెస్టు చేసి, రిమాండుకి తరలించినట్లుగా సిఐ బి.వెంకటరావు తెలిపారు. నిందితుడి స్నేహితుడు రమేష్ మద్యం సేవించి, ఆటో నడుపుతూ, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడగా, నిందితుడు శంకరరావు విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబు నాయుడును అడ్డగించి, దౌర్జన్యం చేయడంతో సోము శంకరరావును అరెస్టు చేశామని తెలిపారు.